

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రపతి వెంట హాజరయ్యారు..
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్ నర్సింహులు కార్యక్రమానికి విచ్చేశారు..
- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సర్ లా యూనివర్సిటీ చాన్సలర్ అలోక్ ఆరాధే..
- కార్యక్రమానికి యూనివర్శిటీ చాన్సలర్ అలోక్ ఆరాధే అధ్యక్షత వహించారు.."
- ఒరిస్సా ప్రభుత్వంలో మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా ద్రౌపది ముర్ము..


10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

ఆదివారం | 29 సెప్టెంబర్ 2024 | పేజీలు 8


# నల్సర్'లా' యూనివర్సిటీకి...
# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



### 21వ వార్షిక స్నాతకోత్సవానికి హాజరైన రాష్ట్రపతి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ 'లా' 21వ వార్షిక స్నాతకోత్సవం వేడుకలు షామీర్‌పేట్‌లోని నల్సర్ లా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. భారత రాష్ట్రపతి, శ్రీమతి ద్రౌపదిముర్ము ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, జస్టిస్ పి.ఎస్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నరసింహులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ఛాన్సలర్ జస్టిస్ అలోక్ ఆరాధే ఈ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ..! చట్టంలోని వివిధ రంగాలలో నల్సార్ కృషిని ప్రశంసించారు. ప్రధానంగా నల్సార్ జంతు సంరక్షణ చటాల గురించి చేస్తున్న కృషిని కొనియాడారు.. ఒరిస్సా ప్రభుత్వంలో మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా ఆమె గతంలో పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, జంతువుల రక్షణ, సంక్షేమానికి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ జంతు సంరక్షణ చటాల అవగహన అత్యవసరమని అన్నారు..

-2లో






### కౌటిల్యుని అర్ధశాస్త్రంలో.. ప్రాచీన భారతదేశం..

భారతదేశంలోని ప్రాచీన భారత పరిపాలనా న్యాయ సంప్రదాయాల గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడారు.. కౌటిల్యుని అర్థశాస్త్రంలో ప్రాచీన భారత్ దేశంలో చట్టపరమైన పరిపాలనపై వివరణ ఉన్నదని తెలిపారు.. దక్కన్ ప్రాంతంలో రచించబడిన అపస్తంభ ధర్మసూత్రాలను ఆమె ప్రస్తావించారు.. భారతదేశం ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని పట్టభద్రులు గుర్తుఉంచుకోవాలని ఆమె ఉద్బోధించారు.. మహాత్మా గాంధీ, డా. బిఆర్ అంబేద్కర్‌లను ప్రస్తావిస్తూ.. కరుణ, వృత్తి పర నైపుణ్యాల సమ్మేళనం ఆ మహనీయులు అందించిన సూత్రమని అన్నారు. సున్నితత్వం, న్యాయబద్ధత అనే రెండు గుణాల కలయికగా ఆ మహా నాయకులు ఉండినారుఅని ఆమె కొనియాడారు. విజయవంతమైన వృత్తి జీవితాన్ని పొందాలనుకునే న్యాయ నిపుణుల కోసం ఆ విలువలను పాటించాలని సూచించారు.. మన రాజ్యాంగ విలువల్లో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులతో అన్నారు.. నిజాయితీ, ధైర్యం లాంటి విలువలకు కట్టుబడి సానుకూల సామాజిక మార్పులకు సారథులుగా నూతన స్నాతకులు ఉండాలని ఆమె కోరారు..

## భవిష్యత్‌లో బీసీలకే ఎక్కువ సీట్లు



హైదరాబాద్ పెన్ పవర్: భవిష్యత్‌లో బీసీలకే ఎక్కువ సీట్లు ఇస్తామని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో (సెప్టెంబర్ 28) మీడియా ప్రతినిధుల తో మహేష్ కుమార్ గౌడ్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా


-2 లో

## కలెక్టరేట్ లో కానిస్టేబుల్ ఆత్మహత్య..
## తుపాకీతో కాల్చుకున్న పోలీస్

హైదరాబాద్ పెన్ పవర్: విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు.. శనివారం తెల్లవారుజామున తన తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పేలుడు శబ్దం వినిపించిందని, పరిగెత్తుకుంటూ వెళ్లి చూడగా ఏఆర్ కానిస్టేబుల్ దూసరి బాలకృష్ణ రక్తపుమడుగులో పడి ఉన్నాడని సహోద్యోగులు చెప్పారు.

-2 లో

- శనివారం తెల్లవారుజామున రంగారెడ్డి కలెక్టరేట్ లో ఘటన
- ఆత్మహత్య లేఖ రాసిపెట్టి దారుణం
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు




# నల్సర్ 'లా' యూనివర్సిటీకి.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..









## ఉన్నత విద్యలో బాలికల ప్రతిభను రాష్ట్రపతి ప్రశంసించారు..

బంగారు పతకాల విజేతల్లో బాలికలు, బాలురు కంటే ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధిస్తున్నారని ద్రౌపది ముర్ము సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో అనేక ఉన్నత విద్యాసంస్థల్లో బాలికలు మంచి ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె అన్నారు.. అనేక పరిమితులు ఉన్నప్పటికీ కుమార్తెలు తమ ఉన్నత ప్రదర్శనతో మనల్ని గర్వపడేలా చేస్తున్నారని ఆమె అన్నారు.. ఇక్కడ ప్రతిభ చూపిన అమ్మాయిలు ఇతర మహిళలు, తక్కువ ప్రాధాన్యత కలిగిన బాలికలకు సహాయం, సాధికారత కల్పించాలని అన్నారు..

నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్‌వర్క్ ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సూచించారు.. ఈ నెట్‌వర్క్ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి, అలాంటి కేసులను ఎదుర్కోవడానికి సంఘటిత ప్రయత్నాలు చేయడానికి ఎంతో పని చేయగలవని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు..

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు: వైస్ చాన్సలర్ కృష్ణదేవరావు ..

నల్సర్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొ. కృష్ణదేవరావు తన సంక్షిప్త స్వాగత ప్రసంగంలో వికలాంగుల హక్కుల చట్టాలు, బాలల హక్కులు, ఖైదీల హక్కులు సంస్కరణల రంగాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నల్సర్ సాధించిన విజయాల గురించి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్విభాగ అధ్యయనాలు చేయడం ఆధునిక విద్యారంగంలో అత్యంత ప్రధానమని, నల్సార్ బోధనా అభ్యసన పరిశోధన కార్యక్రమాన్ని విస్తరించడానికి, యూనివర్సిటీ విద్య విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టభద్రులకు 57 బాగారు పతకాలను రాష్ట్రపతి బహూకరించారు.. బీఏ ఎల్ఎల్‌బి కి చెందిన డి.భవ్య జోహారి 10 బంగారు పతకాలతో, బంగారు పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, అదే తరగతికి చెందిన కుమారి అమీషి 7 పతకాలతో రెండవ స్థానంలో నిలిచారు.. ఈ కార్యక్రమంలో మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు. వాటిలో ఎనిమిది పీహెచ్‌ఎలు. లా అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో వరుసగా 68, 48 మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి, 115, 28 బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ లా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రదానం చేశారు..







# భవిష్యత్‌లో బీసీలకే ఎక్కువ సీట్లు

- మొదటి పేజి తరువాయి

ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే టీపీసీసీ కార్యకర్గ విస్తరణ చేపడతామని.. డీసీసీ బాధ్యతలు ఎమ్మెల్యేలకు ఇవ్వాలనే ప్రతిపాదన ఉందని వెల్లడించారు. పీసీసీ కార్యకర్గ విస్తరణపై త్వరలోనే ఏఐసీసీ పెద్దలను కలుస్తామని పేర్కొన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఇబ్బంది పడుతున్నది వాస్తవమేనని.. కొత్త పాత నేతల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం చేయాలన్న బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మల్లన్న సాగర్ బాధితుల కన్నీళ్లు హరీష్ రావుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లన్న సాగర్ నిర్వాసితులను పరామర్శించేందుకు మేము వెళ్తే మమ్మల్ని పోలీసులు అరెస్ట్ చేయలేదా అని నిలదీశారు. మల్లన్న సాగర్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా న్యాయం చేస్తోందన్నారు. హైడ్రా, మూసీ అభివృద్ధితో సామాన్యులకు కొంత ఇబ్బందైనా.. హైదరాబాద్ మొత్తానికి లాభం జరుగుతుందని స్పష్టం చేశారు.

# కలెక్టరేట్ లో కానిస్టేబుల్ ఆత్మహత్య..

# తుపాకీతో కాల్చుకున్న పోలీస్

- మొదటి పేజి తరువాయి

రంగారెడ్డి జిల్లా మంచాల గ్రామానికి చెందిన దూసరి బాలకృష్ణ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి డ్యూటీకి వచ్చాడు. ఏం జరిగిందో ఏమో కానీ తెల్లవారుజామున తన తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని లేఖ రాసిపెట్టి బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ తండ్రి దూసరి సత్తయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. కాగా, కానిస్టేబుల్ బాలకృష్ణ సూసైడ్ నోట్ రాసింది నిజమేనని ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. ఆ నోట్ లో ఎవరిపైనా ఆరోపణలు చేయలేదని క్లారిటీ ఇచ్చారు. బాత్రూమ్ కి వెళ్లి తన తుపాకీతో తనే కాల్చుకుని చనిపోయాడని, ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించిందని ఏసీపీ తెలిపారు.

# నల్సర్ 'లా' విశ్వవిద్యాలయంలో.. రాష్ట్ర స్థాయి రెవెన్యూ సదస్సు..





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** రాష్ట్రస్థాయి రెవెన్యూ సదస్సు నిర్వహణ ఏర్పాట్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శనివారం పరిశీలించారు.. జిల్లాయంత్రాగానికి ఆయన తగు సూచనలు, సలహాలు చేశారు.. మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్‌లోని నల్సర్ యూనివర్సిటీలో ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ సదస్సుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్రంలోని రెవెన్యూ అంశాలపై అన్ని జిల్లాల రెవెన్యూ సిబ్బందితో తహసీల్లార్ స్థాయి వరకు మంత్రి సమావేశం కానున్నట్లు తెలిపారు.. అందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.. ఆర్ఐ లకు సూచంచిన విధంగా వారికి కేటాయించిన జిల్లా సిబ్బందిని దగ్గరుండి వారి హాజరు, సీటింగ్ ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. ఏర్పాట్లలో ఏలాంటి లోపాలు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు..





---

# సీఎం రేవంత్ రెడ్డికి కోదండరాం సహా విద్యావేత్తల బహిరంగ లేఖ

## అంబేద్కర్ యూనివర్సిటీ భూమిని ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి కేటాయించడంపై లేఖ

## ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోదండరాం సహా విద్యావేత్తల డిమాండ్

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం సహా పలువురు విద్యావేత్తలు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన భూమిని జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు నామమాత్రపు ఫీజుతో ఉన్నత చదువులు అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం అంబేద్కర్ యూనివర్సిటీ అని, కాబట్టి ఆ వర్సిటీ భూమిని ఇతర యూనివర్సిటీలకు కేటాయించవద్దని కోరారు. అంబేద్కర్ యూనివర్సిటీని నిలబెట్టుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. రేవంత్ రెడ్డికి లేఖ రాసిన వారిలో ఎమ్మెల్సీ కోదండరాం, హరగోపాల్, ఘంటా చక్రపాణి, దొంతి నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# వామ్మో .. బడి పిల్లలను పాము ఉరికించింది



**హైదరాబాద్ పెన్ పవర్:**వారం రోజులుగా కురిసిన వర్షాలకు కొమరం భీం జిల్లా కౌటారం మండలం కన్నెపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం సృష్టించింది. టీచర్లు తెలిపిన వివరాల ప్రకారం... క్లాసు రూం లోనికి పాము జొరపడింది. దీనిని గమనించిన విద్యార్థులు బయటకు పరుగులుతీశారు. పాఠశాల చుట్టూ పంట పొలాలు ఉండటం.. చెట్లు. ఉండటం తో ఇటీవల కురిసిన వర్షాలకు పాములు చేరి ఉంటాయని స్కూలు సిబ్బంది చెబుతున్నారు. స్కూలు భవనము చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో తరగతి గదిలోనికి పాము వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## త్వరలో చెన్నూర్‌లో 100 పడకల హాస్పిటల్: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:**చెన్నూరులో త్వరలో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయిస్తామన్నారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. చెన్నూర్ మండలానికి చెందిన మహాలక్ష్మి స్కీమ్ ద్వారా అర్హులైన 8700 మహిళలకు గ్యాస్ రాయితీ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు ఎమ్మెల్యే వివేక్ ..ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రోడ్లు, డ్రైనేజ్ లను ఏర్పాటు చేయకపోవడంతో మున్సిపాలిటీలో వాడలు అస్తవ్యంగా మారాయన్నారు ఎమ్మెల్యే వివేక్. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ఒక్కొక్కటిగా రోడ్లు డ్రైనేజీల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. మహిళల మేలు కోసమే కాంగ్రెస్ సర్కార్ పని చేస్తుందన్నారు వివేక్. గత ప్రభుత్వం ఒక లక్ష రూపాయలను 5 దఫాలుగా రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ 2 లక్షలను ఒకేసారి రుణమాఫీ చేసిందన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని చెప్పారు వివేక్. అర్హులైన పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామన్నారు.60 వేలకోట్ల అప్పులను పదేళ్లలో గత బీఆర్ఎస్ సర్కార్ 7 లక్షల కోట్లకు పెంచిందన్నారు ఎమ్మెల్యే వివేక్. మహిళలకు ఉచిత బస్సు పథకం విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి 300 కోట్లు కడుతుందని చెప్పారు. త్వరలోనే అందరికీ మహాలక్ష్మి పథకం అందుతుందన్నారు. చెన్నూర్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ ఇవ్వాలని సీఎంను కోరామన్నారు. విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా నియోజకవర్గంలో చాల బోర్లు వేశామన్నారు. చెన్నూర్ లో రోడ్ల కోసం రూ.10 కోట్ల తీసుకొచ్చామన్నారు వివేక్.

# హైడ్రా బాధితుల బాధలు విని ఎమోషనల్ అయిన హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు ఎమోషనల్ అయ్యారు. హైడ్రా బాధితులు ఇవాళ హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఆ పార్టీ నేతలు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి తదితరులతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆ ఇళ్ల కోసం ఏళ్లు గా కష్టపడ్డామని, అలాంటి ఇళ్లు తమ కళ్ల ముందే కూలిపోతుంటే తట్టుకోలేకపోతున్నామని వారు కన్నీళ్లు పెట్టుకున్నారు. వారి పరిస్థితిని చూసి హరీశ్ రావు భావోద్వేగాలకు లోనయ్యారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ అండగా నిలుస్తుందని వారికి హామీ ఇచ్చారు.

### గోదావరి నీళ్లు పారిస్తానని పేదల కన్నీళ్లు పారిస్తున్నారు

మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. పేదల కన్నీటిపై అభివృద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. సామాన్యుల ఇళ్లను కూలగొడుతున్న రేవంత్ రెడ్డి తన సోదరుడి ఇంటికి బుల్డోజర్లు పంపించగలరా? అని నిలదీశారు.పేదల ఇళ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలతో పాలన



చేస్తున్నారన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అని చెప్పి మాట తప్పారని, ఇప్పుడు ప్రజలను రోడ్డున పడేశారని ఆరోపించారు. హైదరాబాద్ బ్రాండ్‌ను రేవంత్ రెడ్డి దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన కంటే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, ఆ తర్వాతే ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు.కూకట్‌పల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అన్నారు. హైడ్రా ఇళ్లను కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళనతో ఆమె ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాలతో రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు.బుల్డోజర్ పాలనను ఒప్పుకునేది లేదని హర్యానాలో రాహుల్ గాంధీ నీతులు చెబుతున్నారని, కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. రాహుల్ గాంధీ మొదట తెలంగాణకు వచ్చి బుల్డోజర్ రాజ్యాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా బాధితులు అందరూ తమ కుటుంబ సభ్యులేనని, వారి కోసం బీఆర్ఎస్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని హామీ ఇచ్చారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.

### గాంధీ ఆసుపత్రిలో బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహాన్ని చూసేందుకు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు గాంధీ ఆసుపత్రికి వచ్చారు. అయితే వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో బీఆర్ఎస్ వర్గీయులు వాదనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# అమెరికాలో హరికేన్ విధ్వంసం.. 4 రాష్ట్రాల్లో 45 మంది మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో హరికేన్ హెలెనా విధ్వంసం సృష్టిస్తోంది.. పెనుగాలులకు ఫ్లోరిడా రాష్ట్రం చిగురుటాకుల వణికింది. ఎటుచూసినా విరిగిపడిన చెట్లు, కుప్పకూలిన ఇళ్లు, వరద నీటితో పరిస్థితి భయానకంగా ఉందని బాధితులు వాపోతున్నారు. కుండపోత వర్షాలకు నాలుగు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఇళ్లు, ఆఫీసులు, ఆసుపత్రులు నీట మునిగాయి. విద్యుత్ సరఫరా లేక చాలా ప్రాంతాలు అంధకారంలో మునిగిపోయాయి. ఫ్లోరిడాతో పాటు జార్జియా, నార్త్, సౌత్ కరోలినా రాష్ట్రాల్లో హెలెనా ప్రభావం తీవ్రంగా ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా రాష్ట్రంలోనూ హెలెనా బీభత్సం సృష్టిస్తోంది.జార్జియాలోని ఓ ఆసుపత్రి నీట మునగడంతో పేషెంట్లు, సిబ్బంది బంగ్లా పైకెక్కి సాయం కోసం కేకలు పెట్టారు. బాధితులను కాపాడేందుకు రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు హెలికాప్టర్ సాయంతో మొత్తం 54 మందిని కాపాడారు. నాలుగు రాష్ట్రాల్లో హెలెనా సృష్టించిన విధ్వంసానికి ఇప్పటి వరకు 45 మంది చనిపోయారు. రెస్క్యూ పనుల్లో నిమగ్నమైన ఫైర్ డిపార్ట్ మెంట్ సిబ్బంది ముగ్గురు కూడా చనిపోయారు. టెనెస్సీ లో 7 వేల మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఫ్లోరిడాలో హరికేన్ తీరం దాటే సమయంలో పెనుగాలులు వీచాయి. గంటకు 225 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో తీర ప్రాంతంలోని ఇళ్లు నేలమట్టమయ్యాయి. నాలుగు రోజుల క్రితం ఇళ్లు ఉన్నచోట ప్రస్తుతం శిథిలాల కుప్పలు కనిపిస్తున్నాయి. తీవ్రత ఎక్కువగా ఉండడంతో అధికారులు హెలెనా హరికేన్ ను కేటగిరి 4 గా ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లో సుమారు 25 బిలియన్ డాలర్ల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. అట్లాంటాలో 1886 లో 24.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. హెలెనా ప్రభావంతో 48 గంటల్లో 28.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు.నార్త్ కరోలినాలో వరదల్లో చిక్కుకున్న వంద మందిని రెస్క్యూ టీమ్ లు కాపాడాయి. వరదల్లో ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలతో పాటు ఇంట్లోని వస్తువులు కూడా కొట్టుకుపోయాయి. పలుచోట్ల గ్యాస్ సిలిండర్లు కొట్టుకుపోతుండడం చూశామని వరద బాధితులు చెప్పారు. తలహాస్సీలోని ఓ స్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 175 మంది ఆశ్రయం పొందుతున్నారు. హరికేన్ కారణంగా స్కూళ్లు, ఆఫీసులు, యూనివర్సిటీలు మూతపడ్డాయి.కాగా, హరికేన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ చెప్పారు. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడంతో పాటు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. హెలెనా హరికేన్ ను అంతరిక్ష కేంద్రం నుంచి చిత్రీకరించిన వీడియోను నాసా ట్వీట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే టార్గెట్: విప్ ఆది శ్రీనివాస్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని కోటి మంది మహిళను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు పోతున్నారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రతి ఏటా రూ.20 వేల కోట్లు వెచ్చించి బ్యాంకు ద్వారా వారి జీవన ఉపాధిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపడుతూ మహిళా సాధికారికత లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. గతంలో మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలకు పావలా వడ్డీకి రుణాలు మంజూరు, తదుపరి వడ్డీలేని రుణాలను మంజూరు చేశారని గుర్తు చేసిన శ్రీనివాస్.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే విధంగా మహిళలను అభ్యున్నతికి కృషి చేస్తున్నాని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళలకు రూ.600 కోట్ల బ్యాంకు రుణాలు ఇస్తున్నామని, మహిళలకు ఉపాధి కోసం 125 రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాం వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు.


(సెప్టెంబర్ 28) రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలో రెడ్డీస్ ఫంక్షన్ హాల్ లో మెగా జాబ్ మేళా పోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది నెలల్లో దాదాపు 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని తెలిపారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. గతంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, వేములవాడ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించామని.. పట్టణ కేంద్రాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువత యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. యువత అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. రుద్రంగి మండల కేంద్రాన్ని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు.

# చౌటుప్పల్ లో రోడ్డు ప్రమాదం.. ఆగి ఉన్న బస్సును ఢీ కొట్టిన కంటైనర్ లారీ

## ఇద్దరి దుర్మరణం.. మరో 11 మందికి గాయాలు

## మృతులు ఇద్దరూ ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన వారే

## బస్సు ఫెయిల్ కావడంతో రోడ్డు పక్కన నిలిపిన డ్రైవర్




**హైదరాబాద్ పెన్ పవర్:** రోడ్డు పక్కగా నిలిపి ఉంచిన ట్రావెల్స్ బస్సును ఓ కంటైనర్ లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది.. దీంతో బస్సు వెనకభాగంలో తీవ్రంగా దెబ్బతినగా బస్సులో నిద్రిస్తున్న ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో చోటుచేసుకుందీ ఘోర రోడ్డు ప్రమాదం. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు నుంచి హైదరాబాద్ కు వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చౌటుప్పల్ మండలం ఎల్లంబావి వద్ద ఫెయిలైంది. దీంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కగా పార్క్ చేసి మరమ్మతు చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. బస్సులో ప్రయాణికులు కొంతమంది నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఓ కంటైనర్ లారీ వేగంగా దూసుకువచ్చి బస్సును ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు వెనకభాగం తీవ్రంగా దెబ్బతింది. లోపల సీట్లలో పడుకున్న ప్రయాణికులలో ఇద్దరు యువకులు చనిపోయారు.

వారిద్దరూ ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన సతీశ్ కుమార్, తేజగా పోలీసులు గుర్తించారు. బాధితుల కుటుంబాలకు సమాచారం అందించిన పోలీసులు.. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# ప్రజల నుంచి రూ.300 కోట్లు కాజేసి పారిపోయి.. సాధువుగా జీవనం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల నుంచి రూ. 300 కోట్లకుపైగా సొమ్ము వసూలు చేసి పరారైన ఓ వ్యక్తి సాధువు వేషంలో ఉత్తరప్రదేశ్‌లోని మథురలో పోలీసులకు చిక్కాడు. మహారాష్ట్రకు చెందిన బబ్బన్ విశ్వనాథ్ షిండే అధిక వడ్డీల ఆశతో ప్రజల నుంచి రూ. 300 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించారు. ఆ తర్వాత ఆ డబ్బుతో ఉడాయించాడు. సేకరించిన డబ్బుతో ఆస్తులు కొనుగోలు చేసిన షిండే పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు సాధువు వేషం ధరించి ఢిల్లీ, అస్సాం, నేపాల్‌తోపాటు యూపీలోని పలు జిల్లాలు తిరిగాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని మంగళవారం రాత్రి మథురలో అరెస్ట్ చేశారు.

# హైదరాబాద్ లో ఎలక్ట్రిక్ బైక్ లో మంటలు.. పూర్తిగా దగ్ధం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ఎలక్ట్రిక్ బైకులో మంటలు చెలరేగాయి. శనివారం ( సెప్టెంబర్ 28, 2024 ) ఉదయం కుత్బుల్లాపుర్ లోని సూరారం చౌరస్తా దగ్గర చోటు చేసుకుంది ఈ ఘటన. ఎలక్ట్రిక్ బైకును ఛార్జ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎలక్ట్రిక్ బైకు పూర్తిగా దగ్ధమవ్వగా... పక్కనే ఉన్న మెడికల్ షాపు పాక్షికంగా దగ్ధమైంది. ఈ క్రమంలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక్కసారిగా బైకులో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఉన్నవారు భయబ్రాంతులకు గురయ్యారు. మెడికల్ షాపు ముందే బైకు దగ్ధమవ్వటంతో షాపు ముందు భాగం పాక్షికంగా దగ్ధమయ్యింది. స్థానికుల సమాచారం అందించటంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

# వైసీపీ, బీఆర్ఎస్ వ్యూహాలు ఎందుకు ఫెయిలవుతున్నాయి,,,,



హైదరాబాద్ పెన్ పవర్:
రాజకీయాల్లో ఒక్కోసారి ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతుండడాన్ని చూస్తుంటాం. రాజకీయాలు అంటేనే ఎన్నో ఒడిదుడుకులు.. మరెన్నో సవాళ్లు. ఎప్పుడు ఎవరిని ఓటమిని వరిస్తుందో.. ఎవరికి గెలుపు వస్తుందో ఊహించడం తెలియదు. ప్రజల అంచనాలను ఊహించడం కూడా చాలా కష్టం. ఒక్కోసారి రాజకీయాల్లో కురువృద్ధులైనా.. యంగ్ స్టర్స్ చేతుల్లో ఓటమి పాలవుతుంటారు. ఇంకొన్ని చోట్ల పలుకుబడి పనిచేస్తుంటుంది. లేదంటే చేసిన సేవా కార్యక్రమాలు గెలిపిస్తాయి. కొందరి మీద సానుభూతి వర్కవుట్ అవ్వడం చూస్తుంటాం. మొత్తానికి రాజకీయాల్లో కొనసాగాలంటే ఎత్తుగడలు వేయడంతోపాటు.. ప్రత్యర్థి ఆలోచనలకు ఒక మెట్టు పైకి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ ముఖ్యమంత్రులు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, ఏపీలోని వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిల వైఖరిపై తీవ్ర చర్చ నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించారు. మొదట్లో ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ ఆ తరువాత పూర్తిగా రాజకీయ పార్టీగానూ మారిపోయింది. అయితే.. ఉద్యమకాలంలో కేసీఆర్ పై ఉన్న నమ్మకం, ఉద్యమంపై ఉన్న మమకారంతో చాలా మంది నేతలు ఆయన వెంట నడిచారు. పార్టీని అక్కున చేర్చుకున్నారు. అటు కేసీఆర్ ఉద్వేగభరిత ప్రసంగాలతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో అందరినీ ఆకట్టుకున్నారు. అలా ఉద్యమ సమయంలోనే ఆ పార్టీకి చెప్పుకోదగిన విధంగా స్థానాలను కట్టబెట్టారు. తరువాత తరువాత రాష్ట్రం సిద్ధించాక కూడా ఉద్యమ పార్టీని ప్రజలు ఎక్కడా వీడలేదు. ఉద్యమంలో ఎలా అయితే తోడుగా నిలిచారో.. ఆ తరువాత కూడా అంతేస్థాయిలో అక్కున చేర్చుకున్నారు. అలా మొదటి సారి రాష్ట్రంలో ఆ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. కేసీఆర్ ఆ విధంగా మొదటి సారి సీఎం అయ్యారు. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్.. అటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చూస్తూనే.. ఇటు ఉద్యమ పార్టీని కాస్త పక్కా రాజకీయ పార్టీగా మార్చేశారు. అయినప్పటికీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి పార్టీ వెంటే ఉండిపోయారు. ఆ తరువాత మొదటి టర్మ్ ముగిసింది. రెండో టర్మ్‌లోనూ మరోసారి గులాబీ పార్టీ హవానే సాగింది. అలా రెండు పర్యాయాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఇక మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆయన డక్కిమొక్కీలు తిన్నారు. పదేళ్ల అధికార పీఠానికి బీటలు పడ్డాయి. ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక జగన్‌మోహన్ రెడ్డి విషయానికి వస్తే తన తండ్రి వైఎస్సార్ రాజకీయవారసత్వాన్ని అందిపుచ్చుకొని జగన్ రాజకీయాల్లో వచ్చారు. ఎంపీగా భారీ మెజార్టీతో విజయాలు సాధించారు. అనుకోకుండా తండ్రి వైఎస్సార్ మరణం పొందడంతో ఆయనకు పెద్ద పరీక్షలే ఎదురయ్యాయి. అయితే.. ముఖ్యమంత్రి ఆశించి ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఇవ్వలేదు. దాంతో పార్టీ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. కాంగ్రెస్‌తో కొట్లాడిన ఆయన చివరకు సంవత్సరంన్నర పాటు జైలు జీవితాన్ని గడపాల్సి వచ్చింది. ఇక జైలు నుంచి బయటకు వచ్చాక నిత్యం ప్రజల్లో ఉండిపోయారు. అప్పటికే రాష్ట్ర విభజన జరగడంతో మొదటి సారి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు జగన్. కానీ.. ఎప్పటిలాగే ప్రజలు సీనియారిటీకి పట్టం కట్టారు. చంద్రబాబును సీఎం చేశారు. అలా.. ఐదేళ్లు గడిచాక చంద్రబాబు పాలనపై విసుగు చెందిన ప్రజలు ఆ తదుపరి ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేశారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన జగన్.. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలు కావాల్సి వచ్చింది. వై నాట్ 175 అని అత్యాశతో ప్రచారంలోకి వెళ్లిన ఆయన చివరకు అధికారం కోల్పోవాల్సి వచ్చింది. ఇక్కడ కేసీఆర్, జగన్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. జగన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా కేసీఆర్ స్వయంగా ఏపీ రాష్ట్రానికి వెళ్లారు. అటు జగన్ కూడా చాలా సందర్భాల్లో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఒకవిధంగా చెప్పాలంటే ఓ కుటుంబ సభ్యుల్లాగే వారు కలిసిమెలిసి ఉండేవారు. అయితే.. ఇద్దరు కూడా ఒకేసారి అధికారాన్ని కోల్పోవడం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పుడు ఇద్దరు కూడా అధికారం కోల్పోయి ఉన్నారు. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ ఆసక్తికర అంశాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏపీకి వచ్చే సరికి లడ్డూ వివాదం రచ్చగా మారింది. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేశారంటూ టీడీపీ ప్రభుత్వం పెద్దలు వైఎస్సార్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ వ్యవహారంలో జగన్ చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారనే చెప్పాలి. నెయ్యిలో కల్తీ జరిగితే దాంతో తనకేం సంబంధం అని చెప్పాల్సిన జగన్.. లేదు లేదు నేను నేనే అంటూ నెత్తినేసుకుంటున్నారు. దాంతో ఇప్పుడు ఆయన ఆ వివాదం నుంచి బయటపడడం పెద్ద టాస్క్ అయింది. కల్తీ జరగలేదని మీడియా ముఖంగా చెబుతున్నప్పటికీ ఆయనకు ఆ స్థాయిలో మైలేజీ రావడం లేదనేది వాస్తవం. చంద్రబాబు రాజకీయ చతురత ముందు ఈయన పప్పులు ఉడకడం లేదు అనేది అక్కడ నడుస్తున్న టాక్. అయితే.. దాని నుంచి కొంతైనా కాపాడుకునేందుకు ఇప్పుడు తిరుమల దర్శనానికి వెళ్తున్నారు. ఆయన తిరుమలకు వెళ్లినంత మాత్రానా పడిన ముద్ర పోతుందా..? ల్యాబ్ రికార్డులు తారుమారు అవుతాయా..? అందుకే.. జగన్ రాజకీయ పాఠాలు ఇంకా నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిపుణులు అంటున్నారు. ఇప్పుడు ఆయన తిరుమలకు వస్తే అక్కడ ఖచ్చితంగా నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సో.. అది కాస్త ఆయనకు పెద్ద మైనసే అవుతుంది. గతంలో ఆయన రాజకీయాల కోసం ఎన్నడూ తిరుపతికి వెళ్లింది లేదు. కానీ.. ఈసారి తన నిజాయితీని నిరూపించుకోవాలనే ఉద్దేశంతో తిరుమలకు వెళ్తున్నా ఆ స్థాయిలో నిరసనలు తప్పితే మైలేజీ వస్తుందన్న గ్యారంటీ అయితే లేదు. తెలంగాణలో ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందో అప్పటి నుంచి కేసీఆర్ సైలెంట్ అయ్యారు. దాంతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతా తానై నడిపిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు భగ్గుమంటున్నారు. అయితే.. కేటీఆర్ రాజకీయాలు కూడా జగన్ వలే ఆలోచన లేకుండా ఉంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ప్రతిపక్ష హోదాను ఎదుర్కోలేదు. మొదటిసారి అధికారం కోల్పోవడంతో ఆవేశంతో ఏదేదో మాట్లాడేస్తున్నారు. ప్రతిపక్షం అంటే ప్రభుత్వం చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని వ్యతిరేకించడమే అనే ధోరణిలో ఉన్నారు. ప్రజలు తన వ్యాఖ్యల్ని నమ్ముతారా లేదా అని కనీసం ఆలోచన చేయకుండా.. ఎంతసేపూ రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారు. అటు సోషల్ మీడియాలోనూ నిత్యం రేవంత్ పై, కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేక ప్రచారం సాగిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థపైనా కేటీఆర్ చేస్తున్న ఆరోపణలకు విలువ లేకుండాపోయింది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన వాటినే హైడ్రా కూల్చివేస్తోంది. ప్రైవేటు స్థలాల్లో నిర్మించుకున్న చిన్న గుడిసెను కూడా వారు టచ్ చేయలేదు. కానీ.. దానిపై కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు ప్రజాక్షేత్రంలో మాత్రం తీవ్ర విమర్శలకు దారితీశాయనే చెప్పాలి. చివరకు ఆయన మూసీ అక్రమాలను సైతం వ్యతిరేకిస్తుండడం ఇక్కడ కొసమెరుపు. మొత్తానికి.. తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, వైసీపీలు ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ఉన్నాయి. దాంతో ఏ ఇష్యూను ఎలా ఎంచుకోవాలి..? ఏ ఇష్యూను ఎలా పాజిటివ్‌గా మలచుకోవాలి..? అనే మినిమం ఆలోచనలు లేకుండా దూకుడుగా వ్యవహారంతోనే వెళ్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఎదుటివారి రాజకీయాలను అంచనా వేయడంలో తడబడుతూ ఏదేదో చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అటు చంద్రబాబు, ఇటు రేవంత్ రాజకీయాలను అంచనా వేయడంలో విఫలమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్, వైసీపీలు మరింత పాతాళానికి పోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజకీయాలు నేర్చుకుంటే వచ్చేవి కాదని.. స్వతహాగా చేయాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. అందుకే.. ఆవేశాలకు పోకుండా ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, అలా అయితేనే భవిష్యత్తులో అధికారాలు మరోసారి చేతికి లభిస్తాయని అంటున్నారు. లేదంటే ఈ ఇద్దరు యువ నేతల రాజకీయం ఎంతో కాలం నిలువదని కూడా చెబుతున్నారు.

# సంక్రాంతికి మూవీ ఫెస్టివల్...

హైదరాబాద్ పెన్ పవర్:
ప్రతి ఏడాది సంక్రాంతికి సినిమాల సందడి ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది డిసెంబర్ లో సినిమాల జాతర ఎక్కువగానే ఉంటుంది. ఈ ఏడాది చివరిలో రామ్ చరణ్, అల్లు అర్జున్ సినిమాలు విడుదల కాబోతున్నాయి. ఇక సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు ప్రజలతో పాటుగా సినీ ఇండస్ట్రీలో కూడా సందడి వాతావరణం నెలకొంటుంది. కొత్త సినిమాలు వరుసగా రిలీజ్ అవుతాయి.. అందులో కొన్ని స్టార్ హీరోల సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేస్తాయి. ప్రతి ఏడాది సంక్రాంతికి కొత్త సినిమాల సందడి ఎక్కువగానే ఉన్నట్లు వచ్చే కూడా కొత్త సినిమాలు లెక్కలేనన్ని రిలీజ్ కాబోతున్నాయి. డిసెంబర్ లో రావాల్సిన కొన్ని సినిమాలు పోస్ట్ పోన్ అయ్యి సంక్రాంతికి విడుదల కాబోతున్నాయని వార్తలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. మరి ఆలస్యం ఎందుకు వచ్చే సంక్రాంతి రేసులో ఏ హీరో సినిమా బరిలోకి దిగుతున్నారు...2025 సంక్రాంతి సినీ ప్రియులకు ఫుల్ మీల్స్ ఇవ్వనుందని తెలుస్తుంది. ఈ పండుగ సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర', నందమూరి బాలకృష్ణ 'బాలయ109', విక్టరీ వెంకటేష్ మరియు అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న చిత్రం, అలాగే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ వంటి పలు స్టార్ హీరోల సినిమాలు సంక్రాంతి రేసులో ఉండనున్నాయి. ఇకపోతే కోలీవుడ్ నుంచి కూడా సంక్రాంతి రేసులో స్టార్ హీరోలు పాల్గొంటున్నారు. సూర్య నటించిన 'కంగువా' నవంబర్ 14న విడుదల కానున్న నేపథ్యంలో, కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న 'సూర్య 44'ను కూడా 2025 సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. తమిళ్లో రిలీజ్ కాబోతున్న సినిమాలు తెలుగులో డబ్ అయి విడుదల కాబోతున్నాయి. దాంతో ఇక్కడ రిలీజ్ కాబోతున్న సినిమాలకు పోటీ తప్పలేదు. ముఖ్యంగా సూర్యకు తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండటం తో, ఆయన చిత్రాలు తెలుగు మార్కెట్‌లో కూడా గట్టిగా ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు.. ఆయనకు నుంచి తెలుగులోకి వచ్చిన ప్రతి సినిమా భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇక సూర్య 44 లో స్టైలిష్‌గా కనిపించనున్నారు, అలాగే ఫైట్ సీక్వెన్స్‌లు అద్భుతంగా ఉంటాయని సమాచారం. ఈ చిత్రంలో సూర్య సరసన బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించనుందని టాక్ వినిపిస్తుంది. ఈ మూవీని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ లో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అంటే ఈ సంక్రాంతికి తెలుగు, తమిళ్లో స్టార్ హీరోల మధ్య పోటీ తప్పేలా లేదు. ఇక వచ్చే ఏడాది సీనియర్ హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే వచ్చే సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలు తక్కువగానే ఉన్నాయి.. ఈ సంక్రాంతి కాస్త సినిమాలు తక్కువగా ఉన్నాయి. ఉన్న సినిమాల్లో ఏ సినిమా ఎలాంటి టాక్ ను అందుకుంటుందో చూడాలి? చూద్దాం ఏ సినిమా హిట్ టాక్ ను అందుకుంటుందో.. మరే సినిమా బాక్సాఫీస్



# రెడ్ బుక్ ఓపెన్,...



**హైదరాబాద్ పెన్ పవర్:**
ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరు ప్రముఖంగా వినిపించింది. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన ఎమ్మెల్యేలు,మంత్రులతో పాటు వత్తాసు పలికిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పుకొచ్చారు. రెడ్ బుక్ లో అందరి పేర్లు రాసుకుంటున్నానని.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరిపై చర్యలు ఖాయమని ఎన్నికలకు ముందే ప్రకటించారు లోకేష్. అప్పట్లో అధికారపక్షంగా ఉన్న వైసిపి దీనిని తేలిగ్గా తీసుకుంది. అసలు అధికారంలోకి రాకముందే ఈ రెడ్ బుక్ రాతలు ఏమిటని ప్రశ్నించింది.లోకేష్ కు అంత సీన్ లేదని ఎగతాళి చేసింది.కానీ ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చింది. నారా లోకేష్ మంత్రి అయ్యారు. అప్పట్లో అతిగా వ్యవహరించిన వైసీపీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. భారీగా కేసులు నమోదవుతున్నాయి. ఉన్నతాధికారులపై సస్పెన్షన్ల వేటు కొనసాగుతోంది. దీంతో లోకేష్ రెడ్ బుక్ అమలు చేస్తున్నారా అన్న అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడికక్కడే శాఖా పరంగా దర్యాప్తులు, చర్యలు కొనసాగుతున్నాయి. అయితే దీనితో రెడ్ బుక్ కు ఎటువంటి ప్రమేయం లేదని అంతా భావించారు. అయితే అవన్నీ రెడ్ బుక్ పరిణామాలే అని తాజాగా లోకేష్ ప్రకటించడం విశేషం.ఎన్నికలకు ముందు నారా లోకేష్ సుదీర్ఘ పాదయాత్ర చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు.. యువగళం పేరిట పాదయాత్రకు దిగారు. సరిగ్గా కోనసీమ జిల్లాలో ఉండగా చంద్రబాబు అరెస్టు జరిగింది. దీంతో పాదయాత్రను నిలిపివేశారు లోకేష్. దాదాపు రెండు నెలల తరువాత తిరిగి పాదయాత్రను ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో విశాఖ జిల్లాలో ముగించారు. పాదయాత్ర విజయోత్సవ సభను విజయనగరం జిల్లా భోగాపురం లో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రెడ్ బుక్ ను చూపిస్తూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.గత ఐదేళ్ల వైసిపి పాలనలో చాలామంది నేతలు దూకుడుగా వ్యవహరించారు. ప్రత్యర్థులపై అనుచితంగా ప్రవర్తించేవారు. వ్యక్తిగత కామెంట్లకు సైతం దిగేవారు. అదే సమయంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం వారికి సహకరించేవారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలను పాటించేవారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేష్ నాడు స్పందించారు. అధికార వైసిపి నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ.. రాజకీయ ప్రత్యర్థులను వేధించే అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. చాలా మంది వైసిపి నేతలతో పాటు అధికారుల పేర్లు రాసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం వారిపై చర్యలకు ఉపక్రమిస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతోంది. లోకేష్ రెడ్ బుక్ ప్రస్తావన తేవడం లేదు. కానీ వైసీపీ నేతలతో పాటు నాటి అధికారులు కేసులతో సతమతమవుతున్నారు. అయితే అవి సాధారణ కేసులుగా అంతా భావించారు. కానీ అవి రెడ్ బుక్ ఓపెన్ చేసినవేనని.. మంత్రి లోకేష్ స్పందించారు. అందులో భాగంగానే ఐపీఎస్ లు సస్పెండ్ అయ్యారని పేర్కొన్నారు. శ్రీకాకుళం లోని ఓ పాఠశాలలో అకాస్మిక తనిఖీలు చేసిన తర్వాత లోకేష్ మీడియాతో మాట్లాడారు. ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని గతంలో తాను చెప్పిన మాటలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. మొత్తానికైతే లోకేష్ రెడ్ బుక్ ప్రకటన ప్రకంపనలు రేపుతోంది. మున్ముందు నేతలు, నాటి ఉన్నతాధికారుల అరెస్టు జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# 80కి చేరిన ఉల్లి...



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో ఉల్లి ధరలు వణికిస్తున్నాయి. ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. దీంతో సామాన్యుల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం మార్కెట్ వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉల్లి ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు.గతంలో ఉల్లి ధరలు కిలో రూ.20 వరకు పలికిన ధర.. ప్రస్తుతం నాలుగింతలకు ఎగబాకింది. దీంతో సామాన్యులు కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉల్లి సాగు గణనీయంగా తగ్గింది. మరోవైపు వేసిన పంటలు వరదల ధాటికి కొట్టుకుపోయాయి. రానున్న కాలంలో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు.తెలంగాణ వ్యాప్తంగా ఉల్లి ధరలు ఘాటెక్కాయి. దాదాపు అన్ని జిల్లాల్లోని మార్కెట్లలో రూ. 50 నుంచి 60 వరకు అమ్ముతుండగా.. స్థానిక దుకాణాల్లో కిలో ఉల్లి ధర రూ.70 కు పైగా విక్రయిస్తున్నారు. ఇటీవల టమాట ధరలు వణికించగా.. తాజాగా, ఉల్లి ధరలు పెరగడంతో సామాన్యులు బెంబోలెత్తుతున్నారు. ప్రస్తుతం అన్ని చోట్ల ఇవే ధరలు కొనసాగుతున్నాయి .ఇక, హైదరాబాద్ విషయానికొస్తే.. ఒక్కో మార్కెట్లో ఒక్కో రేటుకు విక్రయిస్తున్నారు. అయితే ఇతర దేశాలకు ఉల్లి ఎగుమతి కారణంగా మలక్ పేటకు వచ్చే ఉల్లి కూడా గణనీయంగా తగ్గింది. దీంతో హైదరాబాద్‌లోని పలు మార్కెట్లలో రూ. 70 వరకు విక్రయిస్తున్నారు. మరోవైపు, సామాన్యులు ఉల్లిని కొనడం తగ్గించుకున్నారు. ధరల పెరుగుదల ఫలితంగా అమ్మకాల పరిమాణం కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు.ఉల్లి దిగుబడి తగ్గడంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. డిసెంబర్ చివరి వరకు ఉల్లి పంటలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. దీంతో అక్టోబర్, నవంబర్ నెలలో భారీగా పెరుగుతాయని చెబుతు న్నారు. వచ్చే వారంలో ఉల్లి ధరలు కిల రూ.80 వరకు వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. ఒకవేళ డిసెంబర్ నెలలో పంటలు చేతికి వస్తే.. ఈ ధరలు తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. హైదరా బాద్ మలకపేట మార్కెట్‌కు మహారాష్ట్ర, కర్ణాటక, మెదక్, కర్నూల్ నుంచి ఉల్లి విపరీతంగా వచ్చేది. వర్షాల నేపథ్యంలో కర్ణాటక నుంచి సైతం దిగుమతి పడిపోయింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఉల్లి సరఫరా కొరత ఏర్పడింది. మలకపేట, బోవెన్ పల్లి, మూసాపేట్, గుడిమల్కాపూర్ తో పాటు ఇతర మార్కెట్లకు సైతం గణనీయంగా తగ్గింది.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:**నిజామాబాద్ జిల్లా బాల్కొండ శాసనసభ్యుడుమంత్రి ప్రశాంత్ రెడ్డి వేల్పూరు లో పత్రికా సమావేశం నిర్వహించారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు గత ఎన్నికల్లో హామీ మేరకు మొక్కజొన్న పంటకు సోయా పంటకు కనీస మద్దతు ధర కాకుండానే బోనస్ గా 500 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు రైతులకు హామీ ఇచ్చిన మేరకు ఎకరాకు 7500 రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు అర్హులైన ప్రతి రైతుకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు బాల్కొండ నియోజకవర్గం లో 48000 రైతులు రుణమాఫీకి అర్హులు కాగా కేవలం 16000 మందికే మాఫీ అయిందని ఇంకా 32000 రైతులకు మాఫీ కావాలని త్వరగా పూర్తి చేయాలని కోరారు అదేవిధంగా బాల్కొండ నియోజకవర్గం లో ప్రజారోగ్యం పూర్తిగా దెబ్బ తిందని చాలా గ్రామాల్లో టైఫాయిడ్ చికన్ గున్యా లాంటి రోగాలు ప్రభలుతున్నాయని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వెంటనే స్పందించి గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

# ఏ ఆర్ కానిస్టేబుల్ తన వెపన్ తో కాల్చుకొని ఆత్మహత్య

**రంగారెడ్డి పెన్ పవర్:**
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం తెల్లవారుజామున ఏ ఆర్ కానిస్టేబుల్ దూసరి బాలకృష్ణ గౌడ్(28) తన పిస్టల్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున బాత్రూం గదిలోకి వెళ్లి తలుపులు మూసివేసి, తన సొంత ఆయుధంతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జవాను మృతదేహాన్ని ఆదిభట్ల పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగినప్పుడు మృతుడితోపాటు సహ ఉద్యోగులు ముగ్గురు ఉన్నట్లు సమాచారం. మృతుడు స్వగ్రామం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని మంచాల మండల కేంద్రం. సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్న బాలకృష్ణ, ఆన్లైన్ గేమ్స్ బానిసైనట్లు సమాచారం.

# జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అక్రమంగా ఆవులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. 40కి పైగా ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. 60కి పైగా ఆవులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు స్థానికుల సహాయంతో ఆవులను బయటకు తీసారు. సుమారు 100కు పైగా ఆవులు ఉన్నట్లు గుర్తించారు. అర్ధరాత్రి హైదరాబాద్ కు అక్రమంగా ఆవులను తరలిస్తుండగా ప్రమాదం జరిగింది.

# ట్రావెల్ బస్సును ఢీకొన్న కంటైనర్ ఇద్దరు మృతి

**యాదాద్రి భువనగిరి పెన్ పవర్:**చౌటుప్పల్ మండలంలోని ఎల్లం బావి గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శనవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఆగి ఉన్న శ్రీకృష్ణ ప్రవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. 11 మందికి తీవ్ర గాయాలు కావడంతో వారిని హైదరాబాదులోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన సమయంలో బస్సులో 23 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది. చనిపోయిన మృతదేహాలను చౌటుప్పల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు. చనిపోయిన ఇద్దరు ప్రయాణికులు ఖమ్మం జిల్లాలోని ఇల్లందు కు చెందిన సతీష్ కుమార్ (55) తేజ (24)గుర్తించారు. పోలీసులు ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మధిర ఎస్బిఐ సిరిపురం బ్రాంచ్ బ్యాంకులో చోరీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని సిరిపురం ఎస్బిఐ బ్రాంచ్ బ్యాంకులో చోరీ జరిగింది. బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వెళ్లారు. శనవారం ఉదయం బ్యాంకు ను ఓపెన్ చేసేందుకు సిబ్బంది రాగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి గ్రిల్స్ తొలగించి లాకర్ డోర్ ను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై సంధ్య ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. క్లోజ్ టీం వచ్చిన తర్వాత బ్యాంకు లోకి అనుమతిస్తామని అధికారులు చెప్పారు. బ్యాంకు కార్యకలాపాలు ఆగిపోవడంతో వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చోరీ ఎంత జరిగింది అనే వివరాలను క్లూస్ టీం వచ్చిన తర్వాత వెల్లడిస్తామని అధికారులు చెబుతున్నారు.

## మారుమూల గ్రామంలో రచ్చబండ కార్యక్రమం?

### ఎమ్మెల్యే ఎదుట మహిళ సమస్యల గళం

**హైదరాబాద్ పెన్ పవర్:** చంద్రుగొండ మండలం మహమ్మద్ నగర్ అనే మారుమూల గ్రామంలో మీ ఊరు – మీ ఎమ్మెల్యే కార్యక్రమం పేరుతో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రచ్చబండ లో ఒక ముస్లిం మహిళ ఆధార్ కార్డ్ తప్పా తమకు ఏ గుర్తింపు లేదంటూ సమస్యల గళం ఎత్తడంతో చలించిపోయారు. ఏకంగా గ్రామాన్ని దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఒక ముస్లిం మహిళ మాట్లాడుతూ... తమ గ్రామానికి విద్య, వైద్యం ఎంతటి అవసరమో ఆవేదనతో తెలిపారు. ఇల్లు, కరెంటు, డ్రైనేజ్ లను ఏర్పాటు చేయాలని కోరింది. తమ గ్రామం మారుమూల ప్రాంతంలో ఉందని తమకు రోడ్డుతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని కోరింది. పలు సమస్యలను ధైర్యంగా ఎమ్మెల్యే కు వివరించడంతో గ్రామస్థులు సదరు మహిళను కరథాల ధ్వనులతో అభినందించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహ్మద్ నగర్ గ్రామాన్ని దత్తత తీసుకుని ఒక మోడరన్ గ్రామంగా తీర్చిదిద్దానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వచ్చేనెల అక్టోబర్ 2వ తారీకు నుండి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం ప్రణాళిక చేపడుతోంది ఈ కార్డ్ ద్వారా పలు సమస్యలు పరిస్కారం అవుతాయని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల ద్వారా ప్రజలు లబ్ధిచెందుతున్నారు.

## మూసీపై తలో మాట....

**హైదరాబాద్ పెన్ పవర్:** “హైదరాబాద్‌లో 28వేల అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఇకపై కొత్త వాటికి ఛాన్స్ లేదు. అన్నింటినీ కూల్చివేయాల్సిందే”.. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇవి. నగరానికి వరదలు వచ్చిన సమయంలో, అక్రమ కట్టడాల వల్లే కాలనీలు నీట మునిగిన సందర్భంలో కేసీఆర్ ఈ కామెంట్స్ చేశారు. ట్విస్ట్ ఏంటంటే, కేసీఆర్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. తండ్రి ఒక మాట, కుమారుడు మరో బాటలో వెళ్తుండడంతో, కేడర్‌ను కన్ఫ్యూజ్‌లోకి నెడుతోంది.

# పొంగులేటిని వెంటాడుతున్న బీజేపీ

**హైదరాబాద్ పెన్ పవర్:** సరిగ్గా 11 నెలల తర్వాత మళ్లీ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై సోదాలు మొదలుపెట్టారు. దాదాపు 16 బృందాలుగా విడిపోయిన అధికారులు ఏకకాలంలో పొంగులేటి ఇల్లు, కార్యాలయాలలో దాడులు చేశారు. కేంద్ర బలగాల సహకారంతో ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు సోదాలు చేస్తున్నారు. అటువైపు మీడియా, ఇతర వ్యక్తులు ప్రవేశించకుండా నిషేధం విధించారు. చివరికి రాష్ట్ర పోలీసులను కూడా అటు వైపుగా రానివ్వడం లేదు.. దీంతో ఏం జరుగుతోంది? అనే ఉత్కంఠ అందరిలోనూ కలుగుతోంది. వాస్తవానికి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత ఏడాది జనవరిలో భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆత్మీయ సమ్మేళనం పేరుతో సమావేశాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాలకు తన అభ్యర్థులను ప్రకటించారు. అయితే అప్పట్లోనే బిజెపి పెద్దలు పొంగులేటి వైపు దృష్టి సారించారు. మాధవనేని రఘునందన్ రావు, ఈటల రాజేందర్ వంటి వారిని ఆయన వద్దకు పంపించారు.. పార్టీలో చేరాలని ఆహ్వానం పలికారు. దీంతో పొంగులేటి బిజెపిలో చేరుతారని ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కాని పొంగులేటి అనూహ్యంగా



బిజెపిలో చేరారు. బిజెపిలో చేరిన తర్వాత ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు దాడులు చేశారు. అప్పట్లో ఈ దాడులను పొంగులేటి ఖండించారు. తాను భారత రాష్ట్ర సమితి నుంచి వెళ్లిపోయిన తర్వాత.. ముఖ్యమంత్రి (ప్రస్తుతం మాజీ) కేసీఆర్ బిజెపితో చేతులు కలిపి తనను వేధిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆ దాడుల తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. పొంగులేటి పాలేరు నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం.. ఆ ఎన్నికల్లో ఆయనే గెలుపొందడం.. ఆ తర్వాత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం వంటి పరిణామాలు చకచగా జరిగిపోయాయి. గత ఏడాది నవంబర్లో ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు దాడులు చేయగా.. ఇప్పుడు సెప్టెంబర్ లో తనిఖీలు మొదలుపెట్టారు. అయితే ఎందుకోసం దాడులు చేశారు? పొంగులేటి కంపెనీలోకి ఏమైనా వివాదాస్పదమైన పెట్టుబడులు ప్రవహించాయా? వస్తున్న ఆదాయానికి చేస్తున్న ఖర్చుకు పొంగులేటి కుటుంబ సభ్యులు లెక్క సరిగా చూపించడం లేదా? ఇటీవల పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి సింగపూర్ ప్రాంతం నుంచి నిషేధిత వస్తువులను దిగుమతి చేసుకున్నాడు. అందులో ఏమైనా కీలక ఆధారాలు లభించాయా? అనే కోణంలో మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల దాడులపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికే బిజెపి ఇలాంటి ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలో మాదిరిగానే అధికార ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ దాడులపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంతవరకు నోరు విప్పక పోయినప్పటికీ.. ఆయన అనుచరులు మాత్రం రాజకీయంగా పొంగులేటిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం ఇదని ఆరోపిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో పొంగులేటికి తిరుగు లేదని.. దాన్ని చూసి ఓర్వలేకనే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అనుచరులు మండిపడుతున్నారు.

# నీటి పారుదల వ్యవస్థలో అవినీతి అధికారులు...

**హైదరాబాద్ పెన్ పవర్:** వ్యవసాయరంగంలో ఎండనకా వాననకా ప్రకృతి వైపరిత్యాలకకు ఎదురొడ్డి పంటలు పండిస్తున్న రైతులకు సాయ పడాలన్న ఉద్దేశంతో ఆ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పొలాలో వ్యవసాయ బావులు ఎండిపో యి.. పంటలు కాపాడుకోలేని పరిస్థితులో ఆ బావులు పూర్తిగా పాడుబడి పో కుండా వాటిలో బోర్లు వేసి తిరిగి నీటివూటను పెంపోందించి రైతుకు చేయూత నివ్వాలన్న లక్షంతో ప్రభుత్వం తెలంగాణ అవినీటిపారుదల అధికారులు సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థను ఏర్పాటు చేసింది.అయితే అందులో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు అవినీతి రుచిమరిగి దాన్ని అవినీతిపారుదల సంస్థగా మార్చుకున్నారు. ఆ సంస్థకు చెదిన కీలక స్థానంలో ఉన్న అధికారిని తమ అక్రమాలు కొమ్ముకాసేలా చేసుకుని యధేశ్చగా అవినీతికి పాల్పడుతున్నట్టు తెలిసింది.గ్రామీణ నీటిపారుదల సంస్థ అసలు లక్ష్యాలు ఏనాడో కరుమరుగైపోయాయి. ఇప్పుడు ఆ సంస్థ ఉద్యోగులు ఇతర శాఖల పనులు చేస్తున్నారు. ఏటా వేలకోట్ల విలువైన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనులు చేయిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను అవకాశంగా మలుచుకున్నారు. అనుకూలమైన వారికి అమ్యామ్యాలు అందజేసి కలెక్టర్ల ద్వారా ఈ పనులకు నిధులు మంజూరు చేయించుకుంటున్నారు. ఇందులో పనిచేసే ముగ్గురు అధికారులు తమ బాస్‌ను అవినీతికి జేమ్సుబాండ్‌గా మార్చేసుకున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ అధికారి సారధ్యంలోనే వీరి అవినీతి తెలంగాణకే పరిమితం కాలేదు.తెలుగు రాష్ట్రాలను కూడ దాటి మళయాల రాష్ట్రానికి కూడా పాకిపోయింది. కేరళ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ఈ అవినీతి అధికారుల ముఠా పనులు చేస్తోంది. తెలగాణ ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా పక్కరాష్ట్రాల్లో పనులు చేయడం నేరం అని తెలిసికూడా వీరు ఏడాదిన్నర కాలంగా అక్కడ వందల కోట్ల విలువైన పనులు చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ అడ్డదారిలో ఈ పనులకు కూడా బినామి కాంట్రాక్టు ఏజెన్సీలను శృష్టించుకున్నారు.ఆర్ఎస్ ఇంజనీరింగ్ ,పద్మావతి ఇన్‌ఫ్రా , జిఎన్‌వి ఇంజనీరింంగ్ సర్వీస్ పేర్లతో ఏజెన్సీలను శృష్టించుకున్నారు.ప్రైవేటు ఏజెన్సీలకు ప్రభుత్వ నిధులు అడ్వాన్సుగా ఇవ్వటం నేరం అని తెలిసి కూడా ప్రభుత్వ అనుమతి తీసకుకోకుండానే బినామి కంపెనీలకు గ్రామీణ నీటిపారుదల సంస్థ నుంచి కోట్ల రూపాయలు అడ్వాన్సులు చెల్లించారు. కనీసం ఈ బినామి ఏజెన్సీల నుంచి బ్యాంకు గ్యారేంటీలు కూడా తీసకోలేదని సమాచారం. ఇప్పటికే ఆర్ఎస్ ఇంజనీరింగ్‌కు రూ.6.90కోట్లు , పద్మావతి ఇన్‌ఫ్రాకు రూ.4కోట్లు , జిఎన్‌వికి కూ.2కోట్లు అడ్వాన్సులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ కంపెనీలు చేతులెత్తేస్తే నీటిపారుదల సంస్థ ఇచ్చిన అడ్వాన్సు నిధులు నీటిపాలైనట్టే .సంస్థకు చెందిన ఆ ముగ్గురు ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ముద్రను వాడేసుకుని కేరళ జల్‌జీవన్ మిషన్ పనులను తమ బినామి ఏజెన్సీలకు కట్టబెట్టించుకున్నారు.వీటికి కనీసం టెండర్లు ప్రక్రియ కూడా నిర్వహించలేదు. మిషన్ పనుల్లో అవసరమైన జిఐ పైపులు ,పివిసి పైపులు ఇతర మెటిరియల్‌ను కొన్ని కంపెనీల నుంచి కారు చౌక ధరలకు నాశిరకానివి కొని , అదే వాటికి అధిక మొత్తంలో బిల్లులు వేయించి సోమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ సంస్థకు చెందిన కొందరు ఉద్యోగులు సిసి రోడ్లు , డ్రైన్లలో నాశిరకం పనులు చేసి రాజకీయ పలుకుబడితో భారీగా సోమ్ము చేసుకున్నట్టు సమాచారం. ఏ సంస్థలోనైనా చేసిన పనులకు ఆడిట్ జరగాల్సిందే . అయితే గ్రామీణ నీటిపారుదల సంస్థలోని ఆ ఉద్యోగులు తాము చేయించిన పనులకు వారే ప్రవేటు వ్యక్తుల ద్వారా ఆడిట్ రిపోర్టులు తమకు అనుకూలంగా చేయించి ఆడిట్ అధికారుల చేతులు తడిపి రిపోర్టులకు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వున్నాయి. తెలంగాణ సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థకు ఎండిగా ఉన్న అధికారిని కొనసాంగించుకుకునేందుకు కోసం ఈ సంస్థలోని ముగ్గరు ఉద్యోగులు ఉన్నత స్థాయిలో చక్రం తిప్పుతున్నట్టు తెలిసింది. పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ఈ అధికారి 2012నుంచి 2015వరకూ డిప్యూటేషన్‌పై నీటిపారుదల సంస్థ ఎండిగా పనిచేశారు. మళ్లి అదే ఆధికారి 2022లో రెండవ సారి ఎండిగా డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈ నెల చివరన ఈ అధికారి రిటైర్డు కావాల్సివుంది. ఈ అధికారి విధి నిర్వహణలో చార్జెస్ పడ్డాయి. ఇవి ఇంకా విచారణ దశలోనే ఉన్నట్టు సమాచారం . రిటైర్‌మెంట్ ఆర్డర్స్‌లో చార్జెస్ పెండింగ్‌లోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అధికారినే మళ్లీ ఎండిగా కొనసాగించుకునేలా ఆ ముగ్గురు అధికారులు చేస్తున్న విశ్వప్రయత్నాల వెనుక దాగిన మర్మం గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయంలో గుప్పుమంటోంది. నీటిపారుదల శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు , అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ కూడా కన్నేసినట్టు సమాచారం.